ప్రజాశక్తి
గురువారం 6 జూన్ 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



నారాయణకు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

2024 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన డాక్టర్ పొంగూరు నారాయణ నివాసం పార్టీ శ్రేణులు, అభిమానులతో జనసంద్రంగా మారిపో యింది .పలువురు ముఖ్యనేతలు, ప్రజలు, వేలాది మంది అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్‌లతో భారీ సందడి నెలకొంది. డాక్టర్ పొంగూరు నారాయణ అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయనను శాలువాలు, పూలమాలలు, భారీగజమాలలు, బొకేలు, జ్ఞాపికలు, స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. తన విజయానికి కృషి చేసిన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు.

నారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

స్వాత్రిక ఎన్నికలు ఫలితాలపై వైసిపి నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు..ఎందుకిలా జరిగిందంటూ లెక్కలు వేస్తున్నారు. పొరపాటు ఎవరిది. ఇందుకు బాధ్యులు ఎవరని చూస్తున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసినా ఎంఎల్ఎల అవినీతి, నోటి దురుసు, అభివృద్ధి లేకపోవడం, ఇతర పార్టీల నేతలను ఇబ్బందులు పెట్టడం ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఫలితాలు చూసిన టిడిపి నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 2019 ఎన్నికల్లో జీరో ఫలితాలు సాధించిన ఆపార్టీ ఇప్పుడు వంద శాతం ఫలితాలు పట్ల సంతోషం వ్యక్తం చేస్తుంది. తాము ప్రచారం చేసినా ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసివచ్చిందని, ఓట్లు చీలకపోవడం కూడా కారణమని చూస్తు న్నారు. జిల్లాలోని పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపికి 7,52,753 ఓట్లు వచ్చాయి. వైసిపికి 5,34,186 ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య ఓట్లు 2,18,565 తేడా ఉంది. ప్రభుత్వ ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా జగన్‌కు పూర్తి స్థాయిలో వ్యతిరేకత లేదు. మొత్తం ఓట్లలో టిడిపికి 15,057 ఓట్లు వచ్చాయి. వైసిపికి 6,410 వచ్చాయి. ఇరుపార్టీల నేతలు ఎక్కడ ఓట్లు తగ్గాయో

ఎందుకిలా జరిగింది..!

- -వైసిపి నేతల విస్మయం
- -ప్రభుత్వ వ్యతిరేకతే ప్రధాన కారణం
- -టిడిపి నేతలు ఉక్కిరిబిక్కిరి
- -పార్లమెంట్ పరిధిలో టిడిపికి 7,52,753
- -వైసిపికి 5,34,186
- -పార్టీల మధ్య ఓట్ల తేడా 2,18,565
- -పోస్టల్ బ్యాలెట్‌లో వైసిపికి 6,410 ఓట్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు వైసిపిని విస్మయానికి గురిచేస్తుండగా, టిడిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రమంతా ప్రభుత్వ వ్యతిరేక పవనాలు భారీగా వీచాయి. నెల్లూరు జిల్లాలోనూ అది కనిపించింది. జిల్లా చరిత్రలో టిడిపికి ఇంతటి ఫలితాలు ఎప్పుడూ రాలేదు. టిడిపి నేతలకు కూడా ఊహించని ఫలితాలొచ్చాయి. వైసిపి నేతలు ఐదేళ్లలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గట్టెకిస్తాయని భావించారు. అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆటో కార్మికులు, లాయర్లు, నాయి బ్రహ్మణులు ఇలా అన్ని వర్గాలకు చేసిన సాయం తమకు బయట పడేస్తాయని భావించారు. ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. ఇందుకు ప్రధాన కారణంగా టిడిపి నేతలుగా చెప్పుకుంటున్నారు. జిల్లా వ్యాపితంగా ఐదేళ్ల కాలంలో టిడిపి నేతలు చేసిన పెద్ద పోరాటాలు ఏమీ లేవు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆందోళనలు నిర్వహించారు. నెల్లూరు నారాయణ ప్రజల కోసం వీధుల్లోకి వచ్చి పోరాటం చేయలేదు. జిల్లాలో ఎక్కడా ఈ పని జరగలేదు. వైసిపి ప్రభుత్వం, స్థానిక ఎంఎల్ఎ అవినీతి, రాష్ట్ర వ్యాపితంగా పార్టీ నేతల నోటి దురుసు, అక్రమ కేసులు, రాజధానితోపాటు జిల్లాలో అక్రమ మైనింగ్, ఇసుక దోపిడీ, దందాలు, గ్రావెల్ దోపిడీకి, కేసులు, ఇలా

ఇవిఎంలను స్టోర్ రూమ్‌కు చేర్చి పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజలను వదిలేసి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ఇచ్చారంటూ ప్రచారం చేసుకున్నారు. ప్రజలు సంక్షేమ పథకాలు తీసుకున్నా అభివృద్ధిని చూశారు. అందుకే మౌనంగా తమ తీర్పును ఇచ్చారు. ఈ తీర్పు ఎవరికీ అంతుపట్టలేదు. సర్వే సంస్థలు అంచనా వేయలేదు. పోలింగ్ రోజు వృద్ధులు, మహిళలు, యువత, క్యూల్లో గంటల కొద్ది నిలబడి ఓట్లు వేశారు. ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసిన ఓట్లుగా తేలాయి. వైసిపి ఓటర్లు ఆపార్టీకి ఓట్లు వేశారు. సాధారణ జనం, యువత, న్యూట్రల్‌గా ఉండేవారు మాత్రం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు..

పార్టీల మధ్య ఓట్లు 2.18 లక్షల ఓట్లు తేడా..!

నెల్లూరు పార్లమెంట్ పరిధిలో టిడిపి, వైసిపికి ఓట్లు తేడా 2,18,565 ఓట్లుగా తేలింది. నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల్లో టిడిపికి వచ్చిన ఓట్లు 7,52,753 ఓట్లు వచ్చాయి. ఇందులో టిడిపికి ఈవిఎంల ద్వార ఉదయగిరి 99,727, నెల్లూరు సిటీ 1,18,126, ఆత్మకూరు 89,243, కందుకూరు 1,07,546, కావలి, 1,04,271, నెల్లూరు రూరల్ 1,05,537, కోవూరు 1,28,303 ఓట్లు వచ్చాయి. వైసిపికి ఈవిఎంల ద్వార ఉదయగిరి 90,983, నెల్లూరు సిటీ 47,613, ఆత్మకూరు 82,505, కందుకూరు 89,733, కావలి 74,520, నెల్లూరు రూరల్ 73,566, కోవూరు 75,266 ఓట్లు వచ్చాయి. ఇక్కడ వైసిపికి ఆపార్టీ నేతలు ఓట్లు పడినట్లు తెలుస్తోంది. జిల్లాలోని యువత, మహిళలు, కొందరు ఉద్యోగులు టిడిపి అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. వైసిపి ఓడిపోయినా ఓటింగ్ వచ్చింది.

వైసిపికి పోస్టల్ 6,410 ఓట్లు

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగుల ఓట్లు వచ్చాయనే ప్రచారం సాగింది. ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్నారు. వైసిపికి ఉద్యోగుల మద్దతు బాగానే ఉంది. ఏకపక్షంగా ఓట్లు వేయలేదని తేలింది. ఏడు నియోజకవర్గాల్లో పోస్టల్ ఓట్లు పరిశీలిస్తే టిడిపికి 15,057 ఓట్లు వచ్చాయి. ఇందులో ఉదయగిరి 1810, నెల్లూరు సిటీ 2,425, ఆత్మకూరు 1,922, కందుకూరు 1,627, కావలి 2,265, నెల్లూరు రూరల్ 3,388, కోవూరు 2,320 ఓట్లు వేశారు. వైసిపికి నియోజకవర్గంలో 6,410 ఓట్లు పడ్డాయి. ఉదయగిరిలో 933, నెల్లూరు సిటీ 449, ఆత్మకూరు 1,084, కందుకూరు 882, కావలి 1,068, నెల్లూరు రూరల్ 1,220, కోవూరు 774 ఓట్లు వచ్చాయి. టిడిపి, వైసిపి నేతలు బూత్‌ల వారీగా లెక్కలు తీస్తున్నారు. ఎందుకిలా జరిగిందని ఆరా తీస్తున్నారు. ఏదేమైనా ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఇలాంటి ఫలితాలే వస్తాయని నిరూపించాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ప్రభుత్వం అధికార పార్టీ దీనిని గుర్తించి పనిచేస్తుందా లేదా చూడాలి.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు :మలేరియా వ్యతిరేక మాసోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని సుబేదార్‌పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జిల్లా మలేరియా అధికారిణి ఈ. హుస్సేనమ్మ దోమకాటు వల్ల కలగే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సుబేదార్ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మాగుంట నగర్ నందు దోమలు - దోమలు పెరుగు ప్రదేశములు -దోమల నియంత్రణ - దోమల ద్వారా వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అధికారిణి మాట్లాడుతూ " లక్ష్యానికి చేరువులో మలేరియా రహిత సమాజం" అనే నినాదం తో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలలో అవగాహన కల్పించాలని కోరారు, ప్రజలు తమ ఇంటి పరిసరాలలో వున్న నీటి గుంటలను పూడ్చాలని, దోమలు గ్రుడ్లు పెట్టకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు, దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా ప్రజలందరూ తప్పనిసరిగా దోమ తెరలు వాడాలన్నారు.కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతిమ , షబ్నా, ఆశా కార్యకర్త మాధవి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ నంద కుమార్ పాల్గొన్నారు.

అక్రమాలు సహించను..!

కోటంరెడ్డి హెచ్చరికలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎలాంటి అవినీతి, అక్రమాలను సహించనని, నేటితో బంద్ చేయాలని, లేదంటే చర్యలు తప్పవని నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధరరెడ్డి వైసిపి నేతలను హెచ్చరించారు. మూడో సారి హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనను బుధవారం ఆపార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన మీడియాతో మాట్లాడారు. నెల్లూరులో అవినీతి, అక్రమాలు, గంజాయి, దౌర్జన్యాలు సాగుతున్నాయని వీటిని ఎట్టి పరిస్థితుల్లో సహించనని ఆయన వైసిపి నేతలను హెచ్చరించారు.ఇప్పటి వరకు అధికార వైసిపి పార్టీ అండతో అది చేశారని, ఇకపై చేస్తే సహించనన్నారు. తమ పార్టీ నేతలు చేసినా ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. ఎప్పుడైనా తన కార్యాలయం తలుపులు తెరిచే ఉంటాయన్నారు. రెండో సారి ఎంఎల్‌ఎగా గెలిచిన తరువాత కొద్ది రోజులు తన కార్యాలయం నుంచి కొంత తప్పులు జరిగాయన్నారు. తరువాత సరిచేసుకున్నానన్నారు. ఇకపై ఎలాంటి తప్పులు చేయకుండా చూస్తానన్నారు. ప్రజలు అభివృద్ధి చేయడానికి అధికారం ఇచ్చారని, ప్రతికారం తీర్చుకోడానికి కాదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా తమ పార్టీ నేతలు, కార్యకర్తలు వైసిపి నేతలపై దౌర్జన్యం చేయొద్దన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే తమ కార్యాలయం గేటు కూడా తాకనివ్వనని తెలిపారు. తన గెలుపుకోసం తమ కుటుంబ సభ్యులతోపాటు, నేతలు, కార్యకర్తల కన్నా తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేసిన కృషిని మరువలేనని కంటతడి పెట్టుకున్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం సిఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ సహకారంతో వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రజలు టిడిపి మెజార్టీ ఇచ్చారని, ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఇలాంటి ఫలితాలు ఉంటాయన్నారు. నెల్లూరు రూరల్‌లో తాను ఓడిపోతానని, ఓడించాలని అనేక మంది పనిచేశారని, తన కుటుంబాన్ని మానసికంగా ఇబ్బంది పెట్టారన్నారు. వారు ఇప్పటికైనా మారాలని కాదంటే ఉపేక్షించనని హెచ్చరించారు. తనకు ప్రజలు ఇచ్చిన ఈ గుర్తింపును వారి కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

టిడిపి నేతల ఇళ్లల్లో సంబరాలు

కిటకిటలాడిన రహదారులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి భారీ విజయంతో నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. వేదాయపాళెంలోని సర్వేపల్లి ఎంఎల్‌ఎగా గెలిచిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసం జనంతో కిటకిటలాడింది. నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలొచ్చిన జనం పూలమాలు, శాలువాలు, స్వీట్లతో సంబరాలు చేసుకున్నారు. ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయం ఉదయం నుంచే కిటకిటలాడింది. కెవిఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ట్రాపిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. పోలీసులు వచ్చి క్లీయర్ చేయాల్సి వచ్చింది. నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలొచ్చారు. మాగుంట లేవుట్‌లోని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నివాసంలోనూ పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. అనేక మంది నేతలు వచ్చి ఆయనను కలిపి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , ప్రశాంతిరెడ్డి ఇళ్లు జనంతో నిడిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు అలాగే కొనసాగింది. నెల్లూరు సిటీ ఎంఎల్‌ఎ పి.నారాయణ కార్యాలయంలోనూ పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. నగర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలొచ్చారు. అభినందనతో ముంచెత్తారు. టిడిపి జిల్లా అధ్యక్షలు అబ్దుల్ అజీజ్ నివాసంలోనూ వేడుకలు జరిగాయి. నగరం మొత్తం ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.

లోకేష్‌కు శుభాంక్షలు చెబుతోన్న బీద రవిచంద్ర

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంటి వద్ద నేతలు, కార్యకర్తల కోలాహలం

నీట్ -2024 ఫలితాలలో 'విశ్వ సాయి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -నెల్లూరు సిటీ :ఈనెల 4న ప్రకటించిన జాతీయస్థాయి నీట్ - 2024 ఫలితాలలో విశ్వసాయి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మంచి పర్సంటేల్ తో పాటు అత్యధిక మార్కులు సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టను పెంచారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ పేర్కొన్నారు. బుధారం స్థానిక అన్నమయ్య సర్కిల్లోని విశ్వసాయి కళా శాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ ఎన్. సత్య నారాయణ మాట్లా డారు. తమ కళాశాల నుంచి 110 మందికి పైగా విద్యార్థులు ఎంబిబిఎస్, బిడిఎస్‌లో చేరడానికి అర్హత సాధిం చారని వారిలో ఎస్. దీక్షిత 658 మార్కులను, కె. ప్రేమ్ సాయి 636 ఎం. యశ్వంత్ కుమార్ 632 కె. పూజిత 626 మార్కులను వై. గురు చంద్రిక 625 డి .హెచ్. వి. ఎస్ . సాయి శ్రీయ 620, పి. శ్లోకా రెడ్డి 612, జి. సత్య కార్తికేయ శర్మ 600 వంటి అత్యుత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. కళాశాల నుంచి 110 మందికి పైగా విద్యార్థులు ఎంబిబిఎస్, బిడిఎస్‌లో చేరకపోవడం తమకు సంతోషాన్ని కలిగి స్తుందన్నారు. ఇంతటి విజయాలను సాధించిన విద్యార్థులకు, అందుకు కారణమైన అధ్యాపకుల బందానికి అభినందనలు తెలిపారు. వైస్ చైర్మన్ జి. కష్ణమోహన్‌మాట్లడారు.కళాశాల చైర్పర్సన్ ఎన్.రుక్మిణి పాల్గొన్నారు.

టిడిపి అభిమానుల సంబరాలు

కందుకూరు :రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించడంతోపాటు గత కొన్నేళ్ళుగా లేని విధంగా టిడిపి జెండాను ఎగురవేశారు. కందుకూరు నియోజకవర్గంలో గెలిపించిన ఇంటూరి నాగేశ్వరరావు కూడా ఘన విజయం సాధించడం పట్ల పట్టణంలో ఉప్పుచెరువు లోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పట్టణంలో ఉప్పు చెరువు ప్రాంతంలో చిన్నపిల్లల మధ్యలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని బాణసంచారం కాల్చి సంబరాలను నిర్వహించారు. కాలనీ తెలుగుదేశం పార్టీ అభిమానులు బైనీడి.నరేష్, వెంకట్ మాట్లాడారు. అల్లూరి చంద్రశేఖర్, జూగుంట మురళి, వెంకటేష్, లంకెనపల్లి రామమ్మ, కనకదుర్గ, సుదర్శన్ ఉన్నారు.

పందెంరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - వలేటివారిపాలెం :మండలంలోని కూనీపాలెం గ్రామ సమీపంలోని పొలాల్లో కోడి పందేల స్థావరంపై ఎస్ఐ బాల మహేంద్ర నాయక్ తన సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఈ ఘటనలో 58,750 నగదు మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిని అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ బాల మహేందర్ నాయక్ తెలిపారు.

ప్రజాతీర్పును గౌరవిస్తాం..

మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓట్లు వేసి గెలిపించారని, ప్రజాతీర్పును తాము గౌరవిస్తామని వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులందరికీ పత్రికాముఖంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు ఇచ్చిన తీర్పు తమను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అదే సమయంలో బాధకూడా వేసిందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అనేకం కాలైనటువంటి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంస్కరణలకు నాంధీ పలి కారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం విషయంలో , అన్న వర్గాలకు చెందిన ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో కాని,2019లో ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఏదైతే చేస్తామని హామీలు ఇచ్చారా వాటిలో 99 శాతం అమలు చేశారన్నారు. ఎక్కడా రాజీ పడకుండా ఎన్ని రకాల ఇబ్బందులున్నా పేదలకు అన్ని వర్గాలకు అండగా నిలిచారన్నారు. అయినా ప్రజలు తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ప్రజలు తీసుకున్న నిర్ణయానికి కారణాలు ఏమిటి అన్నది పార్టీ అంతర్గత సమీక్షలో పరిశీలించుకుంటామన్నారు.

ప్రజలు మార్పును కోరుకున్నారు.. ఎంఎల్‌సి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మార్పును కోరుకున్నారని, ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తున్నామని ఎంఎల్‌సి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాగుంట లే అవుట్ ప్రాంతంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జిజె రావు పేర్కొన్నారు. కృష్ణపట్నం పోర్టులో బుధవారం ప్రపంచం పర్యావరణ పరిరక్షణ వారోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కృష్ణపట్నం పోర్టు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పోర్టు సిఓఓ రాజన్ బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, ఈ హెచ్ఎస్ హెడ్ వేణుగోపాల్ రెడ్డి, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, మృత్యుంజయ్‌రామ్, వివిధ విభాగాల హెచ్ఒడిలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నరుకూరులో వేడుకలు జరిగాయి. సర్పంచ్ అన్నం శ్రీనివాసులు, ఎంపీటీసీ కొణతం రఘుబాబు, పాకం వెంకయ్య, ఆరికాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.

నెల్లూరు :ప్రపంచ పర్యావరణ దినోత్సావాన్ని పురస్కరించుకొని బంగారయ్య-కమలమ్మ చారిటబుల్ ట్రస్టు, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్ ప్రాంతంలోని మహిళా ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పివిఆర్ హాస్పిటల్ వ్యవస్థాపకులు, ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ పి. చైతన్య కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.నెహ్రూ యువకేంద్ర, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని శివాజీ కాలనీ లోని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

నెల్లూరు సిటీ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని డీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ. శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరులోని డికే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఆయన బుధవారం మొక్కలు నాటారు.

అదాని కృష్ణపట్నం పోర్టులో..

వెంకటాచలం : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా వెంకటాచలం గ్రామంలో మొక్కలను నాటారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైన కరేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-ఉలవపాడు : మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యులు పన్నూరు శ్రీనివాసులు తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్షలో పాఠశాలకు చెందిన ఆసోది భాను ప్రకాష్ రెడ్డి, కటారి శ్రీకన్య ప్రతిభ చూపి జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ. 12000 చొప్పున నాలుగు సంవత్సరాలపాటు జాతీయ విద్యామంత్రిత్వ శాఖ ద్వారా ఉపకార వేతనం అందుతోంది. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీధర్ రెడ్డి గ్రామస్తులు అభినందించారు.

'ఇంటూరి'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావుకి కందుకూరు పట్టణ ఆర్యవైశ్యులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన్ను వారు కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తన గెలుపునకు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గెలుపునకు ఆర్యవైశ్యులు ఎంతగానో కృషి చేశారన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలి పారు. ఆర్యవైశ్యులు ప్రశాంత వాతావరణంలో వ్యాపారాలు చేసుకునేందుకు శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. ఏ సమస్య వచ్చినా ఆర్యవైశ్యులకు తాను అండగా ఉంటానన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, పట్టణ టిడిపి కోశాధికారి కొత్తూరి సుధాకర్ రావు, టిడిపి నాయకులు ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, మురారిశెట్టి సుధీర్, కోటా కిషోర్, చీదెళ్ల వేణుగోపాలరావు, పబ్బిశెట్టి వరదరాజ, కంకణాల వెంకటేశ్వర్లు,సిఎం శ్రీను, మోదడుగు శ్రీను ఆర్యవైశ్యులు కలిసి ఇంటూరిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

'కాకర్ల'కు సన్మానం..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ : ఉదయగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 9621 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన కాకర్ల సురేష్‌ను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నెల్లూరు నగరం, మాగుంట లే అవుట్ లోని వారి నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణ పై ఇరువురు చర్చిం చుకున్నారు. అనంతరం కాకర్ల సురేష్ వారి కుటుంబ సభ్యులను బీద రవిచంద్ర ఆయన సతీమణి జ్యోతి దంపతులు ఘనంగా సన్మానించారు.



అంబరాన్నంటిన సంబరాలు

వెంకటాచలం : మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం గుమ్మడి రాజా యాదవ్ మాట్లాడుతూ నేడు రాక్షస పాలన నుంచి విముక్తి పొంది మంచి పాలనకు 2024 జరిగినటువంటి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్, కుంచీ శ్రీనివాస్ యాదవ్, నలబాలపు వెంకటాద్రి, గంటా బాబు, ఖయ్యూం ఖాన్, అబ్దుల్లా, సుధాకర్, మునుస్వామి, రమణయ్య, మణి, రఘురామయ్య, చిరంజీవి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై అపోహలొద్దు

మూడంచెల భద్రతతో కందుకూరును కాపాడుతాం - ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు శాంతి భద్రతల విషయంలో ఎటువంటి అపోహలొద్దని, మూడంచెల భద్రతతో కందుకూరును కాపాడుతానని నూతనంగా ఎన్నిక ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కందుకూరులో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఏదో జరుగుతుంది అనే ప్రజల్లో అపోహలు ఉన్నాయన్నారు. శాంతి భద్రతల విషయంలో తాను ఎక్కడ రాజీ పడే ప్రసక్తే లేదన్నారు .అధికారం శాశ్వతం కాదని, రాష్ట్ర అభివద్ధి శాశ్వతమని, ప్రజలు నూటికి నూరు శాతం నమ్మి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ని అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలు నూటికినూరు శాతం పూర్తిస్థాయిలో నమ్మినందునే తనకు ఓట్లు వేశారన్నారు. వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒమ్ము చేయనని హామీ ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గ సమగ్ర అభివద్ధి లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన ,బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలు కలుపుకుని కృషి చేస్తాననివైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ గురించి మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని, వారిని తెలుగుదేశం నాయకులు ఇబ్బందులకు గురి చేస్తే అండగా ఉంటానని చెప్పారని, . తాను ప్రతిపక్ష కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే మనస్తత్వం తనది కాదన్నారు. . ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తెలుగుదేశం నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధు, నార్నె రోశయ్య ,బెజవాడ ప్రసాదు, మాదాల లక్ష్మి నరసింహం, జనగార్ల నాగరాజు ,వేమల గోపాలరావు ఉన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి

లోకేష్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఇంటూరి

లోకేష్‌ను కలిసిన 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిపి శుభాకాంక్షలు తెలిపారు.ఎన్నికలు జరిగిన తీరును లోకేష్‌కి వివరించారు.

'మానుగుంట' సహకారం.. నిరాకరణపై ఆధారాల్లేవ్..!

బుర్రా మధుసూదన్ యాదవ్

ప్రజాశక్తి-కందుకూరు : శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్నారని, అందుకే కూటమికి పట్టం కట్టారని వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ చెప్పారు. బుధవారం కందుకూరు వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి తనకు మద్ద తుగా చేశాడని కొందరు చేయలేదని కొందరు చెబు తున్నారని ఎన్నికల్లో మహీధర్ రెడ్డి చేశారో చేయలేదో తనకు తెలియదన్నారు. చేయలేద నేందుకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మహీధర్ రెడ్డి 'మీకు చేశారా అని మీరు నమ్ముతున్నారా అని విలేకరులడగా ఆ ప్రశ్న పైనున్నవారికే ఎరుకు అని బుదులిచ్చారు. ప్రజలు రాష్ట్రంలో మార్పు కోరుకున్నందున కూటమికి మద్దతు పలికారని తెలిపారు. చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు నమ్మి ఓట్లు వేశారన్నారు. కందుకూరు నియోజకవర్గం లో అతి తక్కువ సమయంలో వచ్చే పోటీ చేసినప్పటికీ వైసిపి శ్రేణులు మొత్తం తనకు సహకరించారని తెలిపారు. ప్రజలు కూడా సహకరించారన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొందామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. టిడిపి వాళ్లు ఎలాంటి ఇబ్బంది పెట్టిన ఎదుర్కొనేందుకు అందరం కలిసి సిద్ధంగా ఉందామనానరు. ఎన్‌డిఎ కూటమి తరపున గెలుపొందిన చంద్రబాబు నాయుడుకు, తనపై పోటీ చేసి గెలిచిన ఇంటూరు నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. విలేకర్ల సమావేశంలో వైసిపి నాయకులు షేక్ రఫీ ,ఇంటూరి హరిబాబు, ఇంటూరి మాధవరావు ,పరిటాల వీరస్వామి ,ముప్పవరపు కిషోర్ ఉన్నారు.

మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్

అక్షరాస్యతతోనే దేశం అభివృద్ధి

ప్రజాశక్తి-కావలి

దేశ అభివృద్ధి 100శాతం అక్షరాస్యతతోనే సాధ్యమవుతుందని, కావలి జమాతే హింద్ బాధ్యులు షేక్.మహబూబ్ పేర్కొన్నారు. ప్రపంచంలో కెల్లా విద్యా బుద్ధులే ఉత్తమమైన సంపద అన్నారు. నైతిక విలువలతో కూడుకున్న విద్యతోనే ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ చదువు కోవాలని, మరీ ముఖ్యంగా బాలబాలికలు చదువుకోవాలన్నారు. డ్రాప్‌అవుట్ ఎవరైనా ఉంటే వారికి కౌన్సిలింగ్ కూడా ఇస్తామని తుఫాన్ నగర్‌లోని స్థానిక జమాత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక బాధ్యులు మెహబూబ్ భాషా తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కార్యకర్తలు ముహమ్మద్ ముస్లిం, సయ్యద్ జిలాని, మహమ్మద్ రఫీ, షేక్ చాంద్ బాషా, షేక్ ఆబిద్, ఖాదర్ బాషా, షేక్ ఫయాజ్, మహిళా విభాగం బాధ్యులు మహమ్మద్ ఫాతిమా, సభ్యులు కార్యకర్తలు షేక్.నూర్జహాన్, షేక్ బుష్రా, షేక్.షాహినా, షేక్.హబీబా పాల్గొన్నారు.

'పునీత్ సాగర్ అభియాన్'

ప్రజాశక్తి ఇందుకూరుపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మైపాడు సముద్రతీరంలో టెన్ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులు సముద్రతీరంలోనీ వ్యర్థాలను తొలగించి తీర ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న వయస్సు నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్లు గుండాల నరేంద్ర బాబు, కోటపురి ఆరోరా, నాగరాజు, పి ఐ స్టాఫ్ అరుణ్‌కుమార్ శర్మ, అనిల్ శర్మ, అల్లు ఈశ్వర్, సూరజ్ భగేల్, వైకుంఠం, సుధాకర్ రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : బుధవారం పర్యావరణ దినోత్సవం కార్యక్రమం కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ముసునూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై, పర్యావరణాన్ని కాపాడేందుకు మనమందరం విధిగా చెట్లను పెంచి అధిక ఉష్ణోగ్రతలను తగ్గించాలని అక్కడ ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు, సూపర్‌వైజర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ న్యాయవాది ఇసకల సాయి ప్రసాద్, లోక్‌అదాలత్, మెంబర్ ఎం.మాలకొండారెడ్డి, సిడిపిఒ. కె.సౌజన్య, ఎసిడిపిఒ. టి.శారద, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్జి మొక్కలు కూడా నాటారు.

ప్రజాశక్తి-కావలి : సమాజంలో విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో వాయువు కలుష్యం, ధ్వనికాలుష్యం, జల కాలుష్యం పెరిగి ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పౌరసమాజం అడవులను కాపాడుకొని, విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షించుకోవాలని కోరారు.

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. కావలి మునిసిపల్ కమిషనర్ జి.శ్రావణకుమార్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుల అకుల రమణయ్యతోపాటు సహాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ యేసుపు వెంకయ్య, కార్యవర్గ సభ్యులు ఆదిశేషయ్య, గూడల శ్రీనివాసరావు, వై.వి.నాగేశ్వరరావు, ఒ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : సురక్షిత పర్యావరణంతోనే మానవాళి మనుగడని జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం శాఖా గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే అనేక రకాల జీవజాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారిణి కె. మంజులత, విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కావలి : ఒంగోలు బస్టాండ్ వద్ద పాదర్తి నాగరాజు షాప్ దగ్గర ఏర్పాటు చేసిన "వామ్ కావలి మహిళా విభాగ్ చలివేంద్రం"లో పాదర్తి సుబ్బారావు, వెంకట సుజాత ఎన్.డి.ఎ. తెలుగుదేశం విజయోత్సవం సందర్భంగా ఆనందోత్సాహలతో పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ పేదలకు, వృద్ధులకు మండే ఎండల్లో చల్లని మజ్జిగ, మంచి నీరు, పులిహోర, సాంబరన్నం, లడ్డు పంచి పెట్టారు. వారికీ వారి కుటుంబసభ్యులకు మిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలుపుతూ భగవంతుని ఆశీస్సులు, దాహం, ఆకలి తీరినవారి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. వామ్ మహిళా సభ్యులు అనుమాలశెట్టి కామాక్షి, దుగ్గిశెట్టి హేమలత, పానుగంటి జ్యోతి వాసవి సభ్యులు కమల, మనోహరి, పబ్బిశెట్టి కల్యాణి, శ్రీలత, మట్టా లక్ష్మి దీప్తి, పాదర్తి ప్రసాద్ రావు, పాదర్తి సురేష్, డాక్టర్ పాదర్తి నాగరాజు, పాదర్తి సుబ్బారావు, చెన్నా కొండలు, సివిసి సత్యం పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎపిఒ సమీక్ష

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఎపిఒ వెంకటనారాయణ ఫీల్డ్ అసిస్టెంట్లలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు అడిగిన వెంటనే వారికి పనిదినాలు కల్పించాలన్నారు. కూలీలు పని చేసే ప్రదేశాల్లో మంచినీళ్లు, మజ్జిగా లాంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే ప్రదమశికిత్స కోసం కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలను మోటివేషన్ చేసి కూలీకి దగ్గవేతనం అందేలా చూడాలన్నారు. ప్రజలతో మమేకమై కలసిమెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇసిలు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 657పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా వీటిలో 613 పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 38పొగాకు బేళ్ళను తిరస్కరించారన్నారు. వీటిలో ఎన్ఎస్ 15ఎన్ బి19సిఆర్ 04ఉన్నాయని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 06 పొగాకు బేళ్లను వేళానికి తిరస్కరించారని తెలిపారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.331కాగా కనిష్ఠ ధర రూ.204, సగటు ధర రూ.274.65నమోదు కాగా, వేలంలో 23మంది కంపెనీ వ్యాపారస్థులు పాల్గొన్నారన్నారు.

టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-విడవలూరు : మండల పరిధిలోని టిడిపి నాయకులు కార్యకర్తలు విడవలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మొకుల శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో వాడవాడల అంబరాన్ని సంబరాలు నిర్వహించుకున్నారు. బుధవారం ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి 49996 ఓట్ల మెజార్టీతో వైసిపి అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై గెలవడంతో మండల టిడిపి నాయకులు వాడవాడలా కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి పాలనకు నాంది పలికి తెలుగుదేశం పార్టీకి వెల్కమ్ పలకడం చాలా శుభపరిణామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాతూరు శ్రీనివాసులు రెడ్డి, సత్తివేలు, సత్యం రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'కాకర్ల'పై అభిమానాన్ని చాటిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎంఎల్ఎతో కలిసి సంబరాలు చేస్తున్న మహిళలు

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన కాకర్ల సురేష్ అఖండ విజయం సాధించడంపై టిడిపి శ్రేణులు అభిమానులు కొనడంత అభిమానాన్ని చాటుతూ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వింజమూరు మండలం బొమ్మ రాజు చెరువు సమీపంలో ఉన్న తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయానికి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ చేరుకున్న సమాచారం తెలుసుకున్న నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల టిడిపి నేతలు శ్రేణులు పెద్దఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకొని ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముందుగా మహిళా మణులు శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జనసైనికులు బిజెపి నాయకులు కాకర్ల సురేష్‌ను ఘనంగా సన్మానించారు. తెలుగు దేశం జిందాబాద్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి ఉదయగిరి ముద్దుబిడ్డ కాకర్ల సురేష్ అన్నారు. గత 40 యేళ్లుగా మొదటిసారి పోటీ చేసిన వారిని ఓడించడం ఇక్కడ ఆనవాయితీ, ఆ రికార్డును కూడా బద్దలు చేస్తూ 40 సంవత్సరాల రాజకీయ కుటుంబానికి చెందిన మేకపాటి రాజగోపాల్ రెడ్డిని ఓడించి కాకర్ల సురేష్ గెలుపొందారని అనంతరం అఖండ విజయం కేకను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో గెలుపొందానని ఇది ప్రజల విజయమన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నానని అంచలంచెలుగా హామీలను నెరవేరస్తానని తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన ప్రతి నాయకుడు కార్యకర్తను గుర్తించుకొని వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. దేశంలో ఎన్‌డిఎ రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించిందని జోడి ప్రభుత్వంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 165 స్థానాలు సాధించడంతోపాటు 21 ఎంపి స్థానాలు సాధించి మునుపెన్నడూ లేని రికార్డు సృష్టించారన్నారు. రాష్ట్ర ప్రజలు రాక్షస పాలనను అంతమొందించి పండుగ చేసుకుంటున్నారన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 స్థానాలతో పాటు 2లక్షల 40వేలతో ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించారన్నారు. ఆయన సారథ్యంలో ఉదయగిరిని అగ్రగామిగా నిలుపుతానని కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఎనిమిది మండలాల టిడిపి శ్రేణులు జనసైనికులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

'కాకర్ల'కు వంటేరు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్ రెడ్డి, జయచంద్రారెడ్డి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నెల్లూరు నుండి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ వింజమూరుకు వస్తున్న క్రమంలో వారు సంగం సమీపంలో ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ మీ కృషి ప్రజల ఆశీర్వాదం టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో ఎంఎల్ఎగా గెలుపొందానని, మెట్ట గడ్డ రుణం తీర్చుకుంటానని తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తించుకొని వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్‌డిఎ కూటమి విజయంతో జోడి ప్రభుత్వంలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాకర్ల వెంకట్, కాకర్ల సుబ్బానాయుడు, కాకర్ల మస్తానమ్మ, కాకర్ల ప్రవీణ, కాకర్ల దాత్రి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలిగిరి అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-కలిగిరి

కలిగిరి మండలం ఉదయగిరి మెట్టప్రాంతంలో కరువు ప్రాంతమైన కలిగిరిని అన్ని విధాల అభివృద్ధి చేయాలని మండల టిడిపి కన్వీనర్ బిజ్జం వెంకట కృష్ణారెడ్డి కోరారు. ఉదయగిరి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా గెలుపొందిన కాకర్ల సురేష్‌కు బొమ్మరాజు చెరువు దగ్గర కాకర్ల క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిగిరి టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన కలిగిరి నాయకులు, కార్యకర్తలు ఓటర్లకు పేరుపేరునా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

'ఆనం'ను కలిసిన 'కాకర్ల' దంపతులు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆత్మకూరు ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలను టిడిపి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నెల్లూరులోని ఆనం రామనారాయణరెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కావలిలోని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నివాసంలో ఆయనను కలిసి ఆప్యాయంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆనం కాకర్ల 40 సంవత్సరాల రాజకీయం కుటుంబం కలిగిన మేకపాటి కుటుంబాన్ని ఇంటికి సాగనంపారని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రెండు నియోజకవర్గాలను జోడిగా అభివృద్ధికి బాటలు వేద్దామని చర్చించారు. కార్యక్రమంలో కాకర్ల వెంకట్, కాకర్ల వెంకట సుబ్బనాయుడు, కాకర్ల మస్తానమ్మ, కాకర్ల ప్రవీణ, కాకర్ల ధాత్రి, తదితరులు పాల్గొన్నారు.

కావలిని అభివృద్ధి చేసి చూపుతా..

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

కావలి అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, అభివృద్ధి చేసి చూపుతానని కావలి ఎంఎల్ఎగా గెలుపొందిన దగ్గుమాటి (కావ్య) క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం కావలి పట్టణం ముసునూరులోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30,948 ఓట్లతో ఎంఎల్ఎగా తనను గెలిపించిన ఓటరు మహాశయులకు ధన్యవాదాలు తెలిపారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చిన తనను కావలి ప్రజలు బ్రహ్మాండంగా ఆశీర్వదించారని, ఇప్పటివరకు కావలి చరిత్రలో లేని భారీమెజారిటీతో గెలిపించారని తెలిపారు. ఈ విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలకు, ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కావలిలో వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తానని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు కాపాడుతానని తెలిపారు. ముందుగా తుమ్మలపెంట రోడ్డు పనులు మొదలు పెడతామన్నారు. అమృత్ పథకం పనులు తిరిగి మొదలు పెట్టి, కావలి పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తానని తెలిపారు. లోకల్ మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని నెరవేరుస్తానని తెలిపారు. తనకు వచ్చిన మెజారిటీ 30,948. కాబట్టి అన్ని మొక్కలు నియోజకవర్గంలో నాటి, వాటిని పెంచే బాధ్యత తాను తీసుకుంటానని హామీనిచ్చారు. ఎన్నికల సమయంలో ఎంతోమంది సోషల్ మీడియా వేదికగా అనుచిత పోస్టులు పెట్టారన్నారు. వారి ఆర్థిక ఇబ్బందుల బలహీనతను అడ్డు పెట్టుకొని ప్రతాప్‌కుమార్ రెడ్డి వారితో పెట్టించడం జరిగిందన్నారు. ప్రతాప్‌రెడ్డి కావలి నియోజకవర్గాన్ని అవినీతికి అడ్డాగా మార్చేసారని మండిపడ్డారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తన మొదటి లెటర్ ప్యాడ్‌లో సంతకం చేయడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తగు కృషి చేస్తానని తెలిపారు. టిడిపి టికెట్ ఇచ్చిన నారా చంద్రబాబు నాయుడుకు, ప్రోత్సహించిన లోకేష్‌బాబుకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, మన్నవ రవిచంద్ర, పోట్లూరి శ్రీనివాసులు, పోతుగంటి అలేఖ్య, బాలగురు స్వామి, ఏగూరి చంద్రశేఖర్, రహీం, తిరివీధి ప్రసాద్, ఆత్మకూరు నాగరాజు, దేవరకొండ శ్రీను, గుండ్లపల్లి శివాజీ, ఖాదర్ బాషా, చవల రామకృష్ణ, హాజరత్, శివ, జనసేన నాయకులు పబ్బా సాయివిఠల్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పూజలు చేయిస్తున్న ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్

శ్రీవారి సేవలో 'కాకర్ల' కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-ఉదయగిరి

శ్రీవారి సేవలో ఉదయగిరి ఉమ్మడి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు. బుధవారం నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో వెలసి ఉన్న వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి ఎంఎల్ఎగా గెలుపొందిన అనంతరం మొదటిసారి స్వామివారిని దర్శించుకుని స్వామివారి సేవలో నిమగ్నమై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి వెంకటేశ్వర స్వామి కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమంలో తండ్రి కాకర్ల సుబ్బానాయుడు, తల్లి కాకర్ల మస్తానమ్మ, సతీమణి కాకర్ల ప్రవీణ, కుమార్తె కాకర్ల దాత్రి, తదితరులు పాల్గొన్నారు.

కావలి అభివృద్ధికి కృషి..

- రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కావలి

రానున్న 5 సంవత్సరాలలో కావలి నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార పక్షంతో సహకరిస్తామని కావలి తాజా మాజీ ఎం.ఎల్.ఎ. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధ వారం అయన తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో కావలి నియోజకవర్గ ఎం.ఎల్.ఎ.గా తనపై గెలుపొందిన దగ్గుమాటి వెంకట (కావ్య) క్రిష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కావలి పట్టణంలో తనకు సహకరించిన నాయకులు, సర్పంచులకు, జెడ్‌పిటిసిలకు, వార్డు మెంబర్లకు, వాడి ఇన్‌ఛార్జ్‌లకు పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ప్రారంభించి పూర్తయ్యే దిశగా ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. కొంత పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు, ప్రస్తుత అధికార పక్షంతో తమ వంతుగా సహ కరిస్తామన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఐదేళ్లపాటు జరిగిన కావలి పట్టణంలో రామాయపట్నం పోర్ట్, బోగోలు మండలంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, సంక్షేమ పథకాలు, వలంటీర్లు, సచివాలయాలు, నాడు-నేడు పనులను అభివృద్ధి చేశామన్నారు. పోలీస్ శాఖకు ఆశ, అంగన్‌వాడీ, మీడియా మిత్రులకు అలాగే కావలి పట్టణంలోని ఉన్నత అధికారులకు అందరికీ సహకరించిన ప్రతి ఒక్కరికీ రామిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సోమశిలలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-అనంతసాగరం

టిడిపి రాష్ట్రవ్యాప్తంగా ప్రభంజనం సృష్టించడంతో సోమశిలలోని బస్టాండ్ సెంటర్, హిల్ కాలనీలో బుధవారం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసిల యోగు పెంచలయ్య ఆధ్వర్యంలో ఘనంగా టిడిపి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా 20కేజీల కేకులు కట్ చేసి టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. బస్టాండ్ సెంటర్, హిల్‌కాలనీ బాణాసంచాతో మారుమోగింది. నారా చంద్రబాబునాయుడు, ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గువ్వల పెంచలయ్య, ముక్కు పుల్లయ్య, టిడిపి యువ నాయకురాలు యోగు రాధ, మాజీ టిడిపి కోఆప్షన్ సభ్యులు జిలానిబాషా, సోమశిల తెలుగుదేశం గ్రామ అధ్యక్షుడు పొంగూరు మురళి, నాయకులు పోకల శ్రీనివాసులు రెడ్డి, ముక్కు నాగరత్నం, పెంచలయ్య చంటి, కె.నరసింహులు, పెరుమాళ్ళ రవి, ఎస్‌సిసెల్ నాయకులు ఉదయగిరి శ్రీకాంత్, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కావ్య క్రిష్ణారెడ్డి నివాసంలో కోలాహలం..

ప్రజాశక్తి-కావలి : కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి నివాసంలో బుధవారం పండుగ వాతావరణం నెలకొంది. ఎంఎల్ఎగా పోటీ చేసిన మొదటి ప్రయత్నంలోనే కావలిలో భారీ మెజారిటీ సాధించి, కావలి ప్రజల ఆదరాభిమానులు చూరగొన్నారు. గతంలో ఎవరికీ సాధ్యం కాని మెజారిటీ సాధించి తన సత్తాను చాటారు. ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి అభినందనలు తెలిపే వారితో కావలి టిడిపి కార్యాలయం, కావ్య క్రిష్ణారెడ్డి నివాసం ప్రజలతో, కార్యకర్తలతో కిటకిటలాడింది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి బొకేలు అందజేస్తూ, శాలువాలతో సత్కరించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన ఎంఎల్ఎ ధన్యవాదాలు తెలియజేశారు.

కాలనీలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-ఉదయగిరి : తెలుగుదేశం పార్టీ గెలుపు విజయోత్సవ సంబరాలను స్థానిక కావలి రోడ్డులో ఉన్న ఎస్‌టి కాలనీవాసులు బుధవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంబరాలలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పి.చెంచల బాబు యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంట్లో నిజమైన పండుగ జరుగుతుంది అన్న సంకేతాన్ని ఎస్‌టి కాలనీ ప్రజలు తెలియజేశారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి కాలనీవాసులు అందరూ ఒకరినొకరు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంకమ్మ, ఖాన్సాలతో పాటు దుత్తలూరు మాజీ ఎంపిపి శ్రీకుర్తి రవీంద్ర బాబు, మాజీ కన్వీనర్ బొజ్జ నరసింహులు, రాజా, హరీష్, మాబాషా, నాయుడు, చేజర్ల రమణారెడ్డి పాల్గొన్నారు.

'ఆనం' స్వగ్రామంలో సంబరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల) : కూటమి అభ్యర్థి మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి గెలుపొందిన శుభ సందర్భంగా ఆయన స్వగ్రామమైన నాగుల వెల్లటూరుకు విచ్చేసిన టిడిపి నాయకులు వేలూరు కేశవచౌదరికి ఆ గ్రామస్తులు మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికి హారతులతో దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి కార్యకర్తను ఆప్యాయంగా పలకరిస్తూ తానున్నానంటూ భరోసానిచ్చారు.

కూటమి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో టిడిపి ప్రభంజనం సృష్టించడంతో, ఆత్మకూరు శాసనసభ్యులుగా ఆనం రామనారాయణ రెడ్డి గెలవడంతో బుధవారం ఆత్మకూరు పట్టణంలో కూటమి శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. బివిఎస్‌ఆర్ సెంటర్లో టిడిపి శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముందుగా భారీగా కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం డీజే పాటలతో నాయకులు కార్యకర్తలు డ్యాన్సులు వేస్తూ అలరించారు. చిన్నా.. పెద్దా.. అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ డ్యాన్సులు వేశారు. అనంతరం భారీగా బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టిడిపి ప్రభంజనానికి కొట్టుకుపోయి చివరకు ప్రతిపక్ష హోదా లేకుండా వైసిపి 11 సీట్లకే పరిమితమైందన్నారు. ఆత్మకూరు ఎంఎల్ఎగా గెలుపొందడంతో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కార్యకర్తలతో ర్యాలీగా బయల్దేరి బివిఎస్‌ఆర్ సెంటర్‌కు వచ్చి విజయోత్సవంలో పాల్గొని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయోత్సవంలో డీజే పాటలతో ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పులిమి శైలజారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మున్సిపల్ చైర్పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మండల కార్యదర్శి కేత విజయభాస్కర్ రెడ్డి, యువ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్లు గౌస్ బాషా, సూరా భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఖాదర్ బాషా, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, జనసేన నియోజకవర్గం ఇంచార్జి నలిశెట్టి శ్రీధర్, టిడిపి నాయకులు వెంకటసుబ్బా నాయుడు, జయకర్, మధు, చెరుకూరు తిరుపతి నాయుడు, కొప్పోలు చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ 'కాకర్ల'కు ఘనస్వాగతం

ప్రజాశక్తి-కలిగిరి : ఉదయగిరి కూటమి ఎంఎల్ఎగా అఖండ విజయంతో నెల్లూరు నుండి వింజమూరుకు వస్తున్న కాకర్ల సురేష్‌కి నాయకులు ప్రజలు ఎదురెళ్లి ఘన స్వాగతం పలుకుతున్నారు. పుష్పాలను వెదజల్లుతూ భారీ ఎత్తున బాణసంచాలు పేల్చుతూ జననీరాజనాలు పలుకుతున్నారు. కావలి మస్తాపురంలో ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ని నిలిపి విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. కాకర్ల సురేష్ చేతుల మీదుగా కేకును కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్లు పంచి పెట్టారు. కాకర్ల సురేష్ వెంట వారి కుటుంబ సభ్యులు కాకర్ల వెంకట్, కాకర్ల సుబ్బానాయుడు, కాకర్ల మస్తానమ్మ, కాకర్ల ప్రవీణ, కాకర్ల ధాత్రి, ముస్తాపురం నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

మట్ల బ్రదర్స్ ఆధ్వర్యంలో 'కాకర్ల'కు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి

అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కూటమి ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు మాజీ ఎఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మట్ల బ్రదర్స్ రామయ్య లక్ష్మయ్య గజమాలతో సన్మానం చేశారు. బుధవారం వింజమూరు మండలంలోని టిడిపి ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ ఎంఎల్ఎ కాకర్ల సురేష్ వారు మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామలక్ష్మణులు మాట్లాడుతూ మన్నేటి వెంకటరెడ్డి సారథ్యంలో పనిచేసి గెలిపించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మెట్టప్రాంతంలో ప్రజల బాధలను గుర్తించి మీరు అందించిన సేవలే ఈ ఘన విజయానికి కారణమన్నారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడుతూ తనను నమ్మిన నియోజకవర్గ ప్రజలను తాను ఇచ్చిన ప్రతి ఒక్క హామీను అంచలంచలుగా నెరవేరుస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జనసైనికుల సంబరాలు

ప్రజాశక్తి-కావలి

కావలి టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఎంఎల్ఎగా అత్యధిక మెజారిటీతో, జనసేన పార్టీ తరుపున నిలబెట్టిన ఎంఎల్ఎ, ఎంపి అభ్యర్థులు ప్రతిఒక్కరూ అత్యధిక మెజారిటీతో ముఖ్యంగా గెలిచిన సందర్భంగా బుధవారం కావలి జనసేన పార్టీ ఆఫీసులో కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి, నాయకులు, జనసైనికుల సమక్షంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చకుండా అన్నట్లుగానే జనసేనాని పవన్ కళ్యాణ్ ఎన్.డి.ఎ. కూటమిలో టిడిపిని భాగస్వామ్యం చేసి, తనని తాను తగ్గించుకొని, ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం త్యాగం చేసి 21 మందిని ఎంఎల్ఎలుగా ఇద్దరు ఎంపి అభ్యర్థులను నిలబెట్టి, మొత్తం సీట్లు కైవసం చేసుకున్నామన్నారు. అదేవిధంగా కావలి ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కూడా అత్యధిక మెజారిటీతో గెలిచినందుకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కావలి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరుపున వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

కావ్య క్రిష్ణారెడ్డిని కలిసిన రవాణా శాఖ అధికారులు

ప్రజాశక్తి-కావలి : కావలి రవాణా శాఖ అధికారులు బుధవారం ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డిని ముసునూరులోని అయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్‌టిఒ సుధాకర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సుందర్ రావు, కరుణాకర్ తదితరులు పూలబొకేలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. వివిధ అంశాలపై కొద్ది సేపు ముచ్చటించారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS : TIRUPATI
ARC. No.5/2023
Between: M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt. Ltd., TIRUPATHI Rep. by its Manager/Foreman ...Disputant
Vs.
M.YAMINI PRADEEP & OTHERS ...Opponents
Opponent No 4:
P.Vasu, S/o P.Ramanaiah, Prop. M/s Sri Lakshmi Balaji A.C Works, D.No.15/85, Shop No.2, Brindavanam, Nellore - 544002.
Opponent No 5: M.Rathnam, S/o.M.Seshaiah, D.No.5-1-213, Rebalavari Street, Stone House peta, Nellore-524002..
Please take notice that above Dispute is posted to 06-07-2024 for your appearance before the above said Honourable Deputy Registrar of Chits, O/o District Registrar, Opp: TUDA Office, Tirupati at 10:30 A.M either in person or through an advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.
Hg Date: 06-07-2024
S.HARIPRASAD, B.A., L.L.B.,
ADVOCATE TIRUPATHI.